క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ లైట్



స్తంభానికి వేలాడుతున్న విద్యుత్ లైట్

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు అంబేడ్కర్ కూడలి సమీపంలో ఓ విద్యుత్ స్తంభానికి లైటు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ టీసీ కాలనీ కొండ వైపు ఓ స్వీట్ షాప్ ముందున్న విద్యుత్ స్తంభానికి అమర్చిన బల్బు కిందకు వేలాడుతోంది. ఇది విద్యుత్ తీగల ఆధారంగా గాలికి అటూ ఇటూ ఊగుతోంది. దీని బరువుకు తీగలు తెగిపోయి కిందపడే పరిస్థితి నెలకొంది. ఈ బల్బును తొలగించి బాగుచేయాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

12న ఏయూలో క్రిస్మస్ వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఈ నెల 12న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించి మాట్లాడారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ– సీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య టి.షారోన్ రాజు, అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామత్ రెస్టారెంట్‌లో తనిఖీలు



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు నందాజీ, అప్పారావు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలోని కామత్ రెస్టారెంట్‌లో బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఓ వినియోగదారుడు ఈ రెస్టారెంట్‌లో కొనుగోలు చేసిన ఫుడ్ నాణ్యతగా లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.వి.జి.నందాజీ, ఫుడ్‌సేఫ్టీ అధికారి జి.వి.అప్పారావు రెస్టారెంట్‌లోని ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వాటి నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం లాబ్ టెస్ట్‌ల నిమిత్తం పలు రకాల ఆహార పదార్థాల సాంపిల్స్‌ను సేకరించారు. వాటి ఫలితాల ఆధారంగా ఆహార పదార్థాల నాణ్యతను నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

లారీ దగ్ధం



శ్రీకాంత్‌నగర్‌లో దగ్ధమైన లారీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారిలో ఓ లారీ దగ్ధమైంది. వివరాలిలా.. ఇక్కడ రోడ్డు పక్కన లారీలు, ప్రైవేట్ బస్‌లు నిలుపుతున్నారు. బుధవారం వేకువజామున ఓ లారీలో మంటలు వ్యాపించాయి. దీన్ని గమనించిన స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నిస్తూ ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న ఎస్‌ఐ కృష్ణ, సిబ్బంది అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలు అదుపు చేశారు. లారీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉండవచ్చని అగ్నిమాపక సిబ్బంది భావించగా.. ఇక్కడ రాత్రిళ్లు సైతం తిరుగుతున్న ఆకతాయిలు నిప్పు అంటించి ఉంటారేమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో సమస్యల తిష్ట

- బస్ కాంప్లెక్స్‌లో సదుపాయాల లేమి
- అధ్వానంగా వాటర్ ట్యాప్‌లు, టాయిలెట్లు
- గోతులతో నిండిన కాంప్లెక్స్ రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, సిబ్బంది



ఏపీఎస్ ఆర్టీసీ మద్దిలపాలెం బస్ స్టేషన్

మద్దిలపాలెం: నిత్యం ప్రయాణికులతో కళకళలాడే ఏపీఎస్ ఆర్టీసీ మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ సరైన సదుపాయాలు లేవు. దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాప్‌లు అధ్వానంగా మారాయి. నిర్వహణ లోపంతో టాయిలెట్లకు తాళాలు వేసి ఉన్నాయి. బస్ స్టేషన్ ప్రధాన రహదారి గోతులమయంగా తయారైంది. దీంతో ప్రయాణికులు, స్టేషన్ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆధునికీకరించాలని విజ్ఞప్తి

కాకినాడ, రాజమహేంద్రవరం వంటి సుదూర ప్రాంతాలకు ఇదే కాంప్లెక్స్ నుంచి బస్సులు వెళ్తుంటాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు స్టేషన్‌లో సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఆదాయానికి ప్రధాన కేంద్రంగా ఉన్న మద్దిలపాలెం బస్ స్టేషన్ ఆధునికీకరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

స్టేషన్ రోడ్డు గోతులమయం



మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ద్వారం నుంచి లోపలి వరకూ గల రహదారి ఎక్కడికక్కడ గోతులతో నిండిపోయింది. దీంతో ఒళ్లు హూనం అవుతోందంటూ ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

తాగునీటి కుళాయిలు అధ్వానం



బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు అధ్వానంగా మారాయి. ట్యాప్‌ల చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు, పాన్‌పరాగ్ నమిలి ఊసేసిన మరకలతో రోత పుట్టిస్తున్నాయి. ట్యాప్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి నీరు తాగితే అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవడమేనని చెబుతున్నారు.

టాయిలెట్ల నిర్వహణ గాలికి..



బస్ స్టేషన్‌లోని పెయిడ్ టాయిలెట్స్ శుభ్రతలో నిర్వహణ కొరవడింది. వీటిలోకి ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల బయట ప్రదేశం అస్తవ్యస్తంగా తయారైంది. వీటి నిర్వహణపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లకు తాళాలు వేశారు. ఇవి ఎన్నాళ్లగానో నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రా బ్యాంక్‌తో ప్రత్యేక అనుబంధం



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర బ్యాంక్ 101వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఎంవీపీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ హిడెన్‌స్ప్రౌట్స్ స్కూల్‌లో సేవా కార్యక్రమాలు జరిగాయి. 150 మంది దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఎంతో ఉన్నత ఆశయంలో ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించారన్నారు. తెలుగు వారికి ఆంధ్రా బ్యాంక్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, ఐ.కేశవరావు, జి.మృత్యుంజయరావు, ఆర్.వి.రవికుమార్, పి.మోహన్‌రావు, వి.రమణబాబు, బి.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి



రవివర్మకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీ పీటీడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యను తక్షణం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి కోరారు. విజయవాడలోని ఏపీఎస్ ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ రవివర్మను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామన్నారు. పీఎఫ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. డిస్పెన్సరీలో మందుల సరఫరా పూర్తిస్థాయిలో లేనందున సిబ్బంది అవసరమైన మందులు పొందలేకపోతున్నామని తెలిపామన్నారు. ఎక్కడి వారికి అక్కడే ఈహెచ్‌ఎస్ హాస్పిటళ్లకు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నామన్నారు. సిక్ లీవ్‌లకు ఆ నెలలోనే జీతాలు ఇచ్చేలా, ఏ నెలకు సంబంధించిన ఇంక్రిమెంట్లు ఆ నెలలోనే కలిపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని రవివర్మ హామీ ఇచ్చారన్నారు. మిగిలిన అంశాలపై సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి, పి.వి.వి.మోహన్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు పాల్గొన్నారు.

'అపోలో' వైద్యుడికి 'డాక్టర్ శ్రీవాస్తవ' అవార్డు



డాక్టర్ అబ్దుల్ ఖాన్

ఆరిలోవ: ఆర్థోపెడిక్ విభాగంలో అందించే డాక్టర్ శ్రీవాస్తవ మెడల్ అవార్డుకు అపోలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు అబ్దుల్ ఖాన్ ఎంపికయ్యారు. బెంగుళూరులో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక సదస్సులో ఆయనకు అవార్డు ఇవ్వనున్నారు. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, మోకాల మార్పిడి ఫలితాల పోలికపై తాను రాసిన శాస్త్రీయ కథనాలను అవార్డు కోసం ప్రదర్శించినట్లు డాక్టర్ ఖాన్ బుధవారం తెలిపారు. వీటిని ఉత్తమ కథనాలుగా గుర్తించిన అసోసియేషన్ అవార్డు ప్రకటించినట్లు చెప్పారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. ఆరోగ్యంగా ఉందాం



పండ్ల వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ సిబ్బంది

మద్దిలపాలెం: ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలందరికీ అవగాహన కలగాలని, తద్వారా రోగాల బారిన పడకుండా పరిరక్షించుకోవాలని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ సూచించారు. కొత్త వెంకోజీపాలెంలోని జాతీయ రహదారి పక్కనున్న పండ్ల దుకాణం వద్ద వ్యాపారులకు బుధవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డస్ట్ బిన్లు తప్పనిసరిగా వినియోగించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, తద్వారా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దిందేకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వారు శానిటరీ మేస్త్రి రమణ, శ్రీను, రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హార్ట్ ప్లాంట్ కనువిందు



బయోడైవర్సిటీ పార్కులో పెంచుతున్న హార్ట్ ప్లాంట్

బీచ్‌రోడ్డు: ఎడారి ప్రాంతంలో అరుదుగా లభించే వ్యాలెంట్ హార్ట్ (ప్రేమికుల హృదయం) మొక్కలు పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్కులో కనువిందు చేస్తోంది. గృహ అలంకరణకు, ప్రేమికులకు కానుకగా ఇచ్చేందుకు ఉపయోగించే ఈ మొక్కలను ప్రత్యేక వాతావరణంలో పెంచుతామని పార్క్ నిర్వాహకుడు రామమూర్తి తెలిపారు. హార్ట్ ప్లాంట్స్ చాలా ఖరీదైనవని, వీటి పెంపకంపై యువతీ యువకులకు బయోడైవర్సిటీ పార్కులో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఉపాధి పొందే అవకాశముంటుందన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో ఉపాధ్యాయులపై ఒత్తిడి




డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆందోళన కార్యక్రమాల నోటీసు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేసేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల నోటీసును బుధవారం జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని వేళలు, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అంతా అసంబద్ధంగా ఉందన్నారు. విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, పండగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. విద్యా శాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న డీఈవో కార్యాలయం ఎదుట, 16న రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసేలా అధికారుల నిర్ణయాలు ఉండాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, జీవీఎంసీ నాయకులు శోభ తదితరులు పాల్గొన్నారు.

8న మానవ హక్కులపై అవగాహన

ఎంవీపీకాలనీ: ఈ నెల 10న మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ నెల 8న డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో అహగాహన మానవ హక్కులపై కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ విక్రయాలు



టీటీడీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజర్ హైమావతి తదితరులు

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం రూపొందించిన క్యాలెండర్ విక్రయాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే క్యాలెండర్లు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలోని కార్యాలయానికి చేరుకున్నాయి. బుధవారం సాయంత్రం టీటీడీ విశాఖ మేనేజర్ హైమావతి, పలువురు ఉద్యోగులు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30, క్యాలెండర్(నెలవారి) రూ.130కి విక్రయించనున్నట్లు మేనేజర్ తెలిపారు. త్వరలో డైరీల విక్రయాలు కూడా ప్రారంభిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటలకు విక్రయాలు జరుగుతాయని చెప్పారు.

ఘంటసాల స్మారక ఆడిటోరియం నిర్మించాలి



బీచ్ రోడ్డులోని ఘంటసాల విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న అభిమానులు

ఏయూక్యాంపస్: ఘంటసాల విగ్రహం ప్రాంగణంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు కోరారు. గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం తిరుమలరావు మాట్లాడుతూ విగ్రహ ప్రాంగణంలో పాడైన హెలికాప్టర్‌ను తీసుకొచ్చి మ్యూజియం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ స్థలాన్ని ఘంటసాల పార్క్‌గా అభివృద్ధి చేయాలని, స్మారక ఓపెన్ ఆడిటోరియం నిర్మించి, కళాకారులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ గౌస్, సంస్థ గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, గాయకులు నూకల ప్రభాకర్, కె.రాజేంద్రప్రసాద్, బి.సత్యనారాయణ, మధుపాడ రమణి, పాలమరశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సిద్ధం కండి



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు



హాజరైన ఏయూ విభాగాధిపతులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 7న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతున్న నేపథ్యంలో విభాగాధిపతులతో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఆయా విభాగంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి విభాగంలో ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించడం, వారితో నేటితరం విద్యార్థులను అనుసంధానం చేయడం, వారి మార్గదర్శకం, విలువైన సూచనలు ప్రస్తుత తరానికి అందించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ, జి.గిరిజ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బియాండ్ ది క్లాస్‌రూమ్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం మూడో సంచిక బియాండ్ ది క్లాస్‌రూమ్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సులో అనేక మంది నిపుణులతో చర్చలు, విలువైన సూచనలకు మార్గం చూపిందన్నారు. ఈ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలను ప్రత్యేక సంచికగా తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. పుస్తక సంపాదకులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాష్‌రావు, డాక్టర్ ఎం.అబ్దుల్ జుల్ఫికర్ అలీ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

మద్దిలపాలెం: రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో విభిన్న ప్రతిభావంతులు మరింత వివక్షకు గురవుతున్నారని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓబీసీ డిపార్ట్‌మెంట్ పరిశీలకుడు మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి విభిన్న ప్రతిభావంతులకు అందని ద్రాక్షగా మిగులుతున్నాయన్నారు. ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలు కొరవడం వంటి కారణాలతో వీరు ఆరోగ్య అసమానతలు ఎదుర్కొంటున్నారన్నారు. వీటి పరిష్కారానికి మానవ హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వాలే బాధ్యత వహించాలని చెప్పారు. వీరికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వల్ల వారి హక్కులు, అవసరాలు, సమస్యలపై స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు గలమెత్తి ప్రశ్నించడానికి, పోరాడాటానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దివ్యాంగులకు విభిన్న ప్రతిభావంతులుగా నామకరణం చేశారని, వారి సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతుల ప్రగతిపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

నావికాదళ సిబ్బంది సందడి



నేవీ డేను పురస్కరించుకొని బుధవారం బీచ్ రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుసుర సబ్‌మెరైన్‌ను ప్రత్యేక జెండాలతో అలంకరించారు. కొంతమంది నావికాదళ సిబ్బంది సబ్‌మెరైన్‌పై ఫొటోలు తీసుకుని సందడి చేశారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మహా అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలోని రాజరాజేశ్వరి సహిత శ్రీ రామలింగేశ్వర ఆలయం వద్ద బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు దాసు, రామిరెడ్డి, అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.